క్లుప్తంగా

సంక్రాంతి సంతోషమేది?



గరుగుబిల్లి: ప్రస్తుత కూటమి పరిపాలనలో ఎక్కడ చూసినా అవినీతి, అరాచకం రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు ఆదివారం అన్నారు. నిత్యావసర వస్తువుల దగ్గర నుంచి అన్నింటిపై ధరలను పెంచి ప్రజలకు సంక్రాంతి సంతోషం లేకుండా చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఇచ్చి పండగల సమయంలో అండగా ఉన్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు ఎంతో బాధపడుతున్నారన్నారు. అర్హులైన వికలాంగుల పింఛన్లు కూడా తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. తిరుమలలో గతంలో ఎప్పుడూ కూడా తొక్కిసలాట జరగలేదని, ఆఘటనను కూడా జగన్‌మోహన్ రెడ్డిపై నెట్టే ప్రయత్నం చేయడం మరింత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.

భోగి మంటలకు ఏర్పాట్లు



ఎల్విన్‌పేటలోని ప్రతిభాభారతి కాలనీలో భోగిమంటల కోసం దుంగలను సిద్ధం చేస్తున్న యువకులు

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని గ్రామాల్లో భోగి మంటలు వేసేందుకు యువత, గ్రామపెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఏ గ్రామంలో చూసినా భోగి మంటలు వేసేందుకు కలపను సిద్ధం చేస్తున్న దృశ్యాలు ఆదివారం అంతా కనిపించాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యవసర సరుకులు అందజేస్తున్న శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పాలకొండ రూరల్: పట్టణంలోని పలువురు నిరుపేదలకు శిష్టకరణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకుల కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రూ.650 విలువైన కిట్లను 50 మందికి అందించినట్లు ఆ సంఘ ప్రతినిధులు శ్రీనివాసరావు, శివబాల, మురళి, ఒప్పంగి చంద్రమౌళి, బి.కాంతారావు తదితరులు తెలిపారు.

సన్మార్గంలో నడవాలి

పాలకొండ: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎన్వీ రమణ అన్నారు. స్థానిక పట్టణంలోని నాగవంశం వీధి రామాలయంలో దివ్యజ్ఞాన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని, మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పొరుగువారి పట్ల దయ, కరుణ, జాలి కలిగి ఉండాలన్నారు.

గ్రామాల్లో గోశాలలు ప్రారంభం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించిన గోశాలలను ఆయా గ్రామాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. గుచ్చిమిలో ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, సర్పంచ్ ఎం శ్రీదేవి, స్థానిక నాయకులు బి.చిరంజీవి గోశాలను ప్రారంభించారు. అలాగే కె.సీతారాంపురంలో కె.రామకృష్ణ, వెంకటనాయుడు, ఆర్.వెంకంపేటలో ఆర్. సింహాచలరావు, మాజీ సర్పంచ్ పి.ఉమ గోశాలను ప్రారంభించారు.

విద్యార్థిని ఆత్మహత్య



స్వాతి మృతదేహం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామానికి చెందిన జీలకర్ర స్వాతి (17) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రెండు నెలల కిందట బొబ్బిలిలో ఈమెపై అత్యాచారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వ్యవహారం కోర్టులో నడుస్తోంది. అప్పటినుంచి ఇంటిలో ఉంటున్న స్వాతి మనోవేదనకు గురై అవమానం భరించలేక గ్రామ సమీపంలో గల పాక వద్ద (కొండ సమీపంలో ఉన్న పాక) ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుంది. ఆమె మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించింది. సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలు పార్వతీపురం ఏకలవ్య పాఠశాలలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. సూసైడ్‌నోట్‌లో ఏముందో తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు!



భామిని: ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను పొలం నుంచి ఇంటి వద్దకు చేర్చడం ఒక ఎత్తయితే.. నూర్పులు అనంతరం చేతికి వచ్చిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం మరో ఎత్తు. ముఖ్యంగా ధాన్యం నిల్వలో తగిన జాగ్రత్తలు పాటించకుంటే ఏడాది పొడవునా దాచుకునే ధాన్యం గింజలు పాడైపోతాయని, ఫలితంగా తర్వాతి సీజన్ పంట వేసేందుకు నాణ్యమైన విత్తనాలు కూడా ఉండవు. ఈ నేపథ్యంలో ధాన్యం నిల్వ చేసుకోవడంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ యాజమాన్య పద్ధతులు అవలంబించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్నకుమారి సూచిస్తున్నారు.

గింజ బరువు తగ్గుతుంది..

నిల్వ చేసిన ధాన్యాన్ని సీతాకోకచిలుక, పెంకుపురుగులు ఆశించి, ధాన్యపు గింజలపై రంధ్రాలు చేసి నష్టం కలుగజేస్తాయి. ఆయా పురుగులు ఆశించి దెబ్బతిన్న ధాన్యం గింజల నుంచి వెగటు వాసన రావడంతో పాటు గింజ బరువు తగ్గడంతో నాణ్యత ఉండదు. పురుగు పట్టిన ధాన్యాన్ని శిలీంద్రాలు ఆశిస్తే ధాన్యం రంగు కూడా మారుతుంది. దీంతో నాణ్యత, మొలక శాతం తగ్గిపోతుంది. విత్తన విలువ సైతం పడిపోతుంది. ప్రోటీన్లు, పోషక విలువలు కూడా తగ్గిపోతాయి. తద్వారా మార్కెట్‌లో ధర పలకదు.

- ధాన్యం భద్రపరచడంలో యాజమాన్య పద్ధతులు అవలంబించాలి
- నాణ్యమైన విత్తనాలకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- తేమశాతం లేకుండా జాగ్రత్త వహించాలి
- పురుగు ఆశించకుండా తగిన మందుల పిచికారీ చేపట్టాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- కోతల సమయంలో ధాన్యంలో తేమ శాతం 24 వరకు ఉంటుంది. అందుకే ధాన్యం నిలువ చేసే ముందు తేమశాతం 14 ఉండేటట్లు జాగ్రత్త వహించాలి. దీనికోసం ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టాలి.
- ధాన్యం నిల్వ చేసే ముందు గొడౌన్లను శుభ్రం చేయాలి. గతేడాది వాటిల్లోని మిగులు ధాన్యం బయటకు తీసేయాలి.
- పురుగుపట్టిన ధాన్యం ఉంటే లీటరు మలాథియాన్ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి 100 చదరపు మీటర్లకు 5 లీటర్ల ద్రావణం చొప్పున పిచికారీ చేయాలి. లేదా 50 గ్రాముల డెల్టామిత్రిన్‌ను 3 లీటర్ల నీటికి కలిపి 100 చదరపు మీటర్లలో పిచికారీ చేయాలి.
- వీలైనంత వరకు కొత్త సంచుల్లోనే ధాన్యం నిల్వ చేయాలి. పాత సంచులు వాడితే వాటిలో క్రిమికీటకాలు లేకుండా బాగా శుభ్రం చేసి ఎండబెట్టాలి. వాటికి చిరుగులు ఉంటే కుట్టి వాటిని పెద్ద డ్రమ్ములో ఉంచి అల్యూమినియం ఫాస్ఫేట్ బిళ్లలు వేసి మూతపెట్టి వారం రోజుల తర్వాత ఆ సంచులను బయటకు తీసి వాడుకోవాలి.
- ధాన్యం బస్తాలను నేలకు, గోడలకు, పై ఉపరితలానికి తగలకుండా పొడి ప్రదేశంలోనే ఉంచాలి.
- లాట్‌కు లాట్‌కు మధ్య 2 నుంచి 3 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. ఇలా చేస్తే ధాన్యానికి పురుగు పట్టిందీ లేనిదీ స్పష్టంగా తెలుసుకోవచ్చును.
- నిల్వ ఉన్న పాత ధాన్యాన్ని కొత్త ధాన్యంతో కలపకూడదు. 100 కిలోల ధాన్యానికి 2 కిలోల వేప గింజల పొడి లేదా వేపాకులను కలిపితే బియ్యపు చిలక తదితర పురుగులు దరిచేరవు.

ఎలుకలు ప్రవేశించకుండా చూడాలి..



ధాన్యం నిల్వ చేసే చోటకు ఎలుకలు రాకుండా చూసుకోవాలి. తేమ కూడా చేరకుండా జాగ్రత్త వహించాలి. వీలైతే గోడలకు సున్నం వేయించి, ధాన్యం నిల్వ ప్రదేశం లోపల, బయట పురుగుమందు పిచికారీ చేయాలి. గొడౌన్ల కిటికీలు, తలుపులకు ఖాళీలు, రంధ్రాలు లేకుండా చూడాలి.

–కె.రత్నకుమారి,
ఏడీఏ, వ్యవసాయ శాఖ, పాలకొండ

మొక్కుబడిగా రహదారి మరమ్మతులు

కొమరాడ: రహదారుల మరమ్మతులను ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహించింది. దీంతో పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణ సమయంలో వాహనదారులు పండగపూట చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కోటిపాం వంతెన మీద గోతులు



సోమినాయుడువలస గేటు వద్ద గోతులమయమైన రహదారి

ఆకట్టుకున్న వర్ణచిత్రం



గరుగుబిల్లి: తెలుగు సంప్రదాయాలను గుర్తుచేస్తూ గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, ఇంటిముందు రంగవల్లులు సంక్రాంతి పండగకు ఒక ప్రత్యేకత. ఇందులో భాగంగా మండలంలోని నాగూరుకు చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు సంక్రాంతిని పురస్కరించుకుని అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన వర్ణచిత్రం పలువురిని ఆకర్షించింది.

1900 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



బెల్లంఊటల డ్రమ్ములను చూపిస్తున్న పోలీస్ సిబ్బంది

వీరఘట్టం: మండలంలోని చినగోర పరిసర ప్రాంతాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ జి.కళాధర్ ఆదివారం తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా సారా విక్రయించినట్లు, తయారు చేసినట్లు, రవాణా చేసినట్లు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

సీతంపేట: మండలంలోని చాపరాయిగూడ సమీపంలో సారా తయారీకి వినియోగించే 300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు.

యువత సమాజాభివృద్ధికి కృషిచేయాలి



వివేకానందుని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ తదితరులు

గరుగుబిల్లి: యువత సామాజిక అభివృద్ధికి కృషిచేయాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు మండలంలోని తోటపల్లిలో స్వామి వివేకానంద 162 జయంతి ఉత్సవాల్లో భాగంగా తోటపల్లిలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ సేవే మాధవసేవ అనే ఎలుగెత్తి చాటిన వివేకానందుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. యువతలో సామాజిక బాధ్యత పెరగాలని పిలుపునిచ్చారు. పాశ్చాత్య సంస్కృతికి, ఆకర్షణకు లోనై యువత సేవాభావానికి దూరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ డి.పారినాయుడు, సిబ్బంది ప్రహరాజ్, ఎం.నూకంనాయుడు, ఎం. మురళీమోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నాగూరులో అక్కేన చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మధుసూదనరావు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని రావివలసలో ఎంపీటీసీ కె.భరత్, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ తదితరులు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



తోటపల్లిలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

ఆశయ సాధనకు కృషిచేయాలి

జియ్యమ్మవలస: స్వామి వివేకానంద ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని టీకెజమ్ము గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అడ్డాకుల భారతి మాట్లాడుతూ యువత సేవాభావంతో వివేకానందుని స్ఫూర్తితో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం పలువురు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు శంకరరావు, సుగ్రీవులు, సుందరరావు, స్థానిక ఉపాధ్యాయులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

భామిని: మండలంలోని పాలికిరి–బాలేరు గ్రామాల కూడలిలో వివేకానంద జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి వివేకానంద విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు కె.ఆంజనేయులు, బీజేపీ నేత కె.తిరుపతిరావు, మత్స్యకార సంఘ నాయకుడు బర్ల ఆనందరావులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

ఆర్ట్స్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి జంక్షన్ వద్ద గల అంగరాలమ్మ ఎఫ్‌పీఓ కార్యాలయంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకా నంద జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు నీచుక చిరంజీవి, ఎం.సూర్యారావు, బి.సుగ్రీవులు, వసంతరావు తదితరులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న నాయకులు

నవోదయ మోడల్ టెస్ట్‌తో మేలు



వీరఘట్టం: నవోదయ మోడల్ టెస్ట్‌తో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీన జరిగే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముందస్తుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా మన ప్రతిభ ఏ స్థాయిలో ఉంటుందన్న విషయం మనకు తెలియవస్తుందన్నారు. ఆ తర్వాత మన ప్రిపరేషన్ ఏ మేర ఉండాలన్న విషయం అర్థమై దానికి అనుగుణంగా మన చదువు కొనసాగించి విజయానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కురమాన గోవిందరావు, వాసుదేవరావు, వి.అన్నాజి, దుర్గాప్రసాద్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పందాలు వద్దు..సంప్రదాయ క్రీడలే ముద్దు

గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి, గొర్రె పందాలు వద్దని సంప్రదాయ క్రీడలే ముద్దని ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామాల్లోని యువతీయువకులు రంగవల్లులు, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడాపోటీలు నిర్వహించుకోవాలే తప్ప పేకాట, కోడి, గొర్రె పందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ గ్రామ పరిధిలో నైనా ఇటువంటి పందాలను నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండుగ సరదాల పేరుతో వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పట్టుబడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ సంస్థలేవీ గిరిజనులు సాగు చేసిన పత్తిని కొనుగోలు చేయకపోవడంతో తప్పని పరిస్థితుల్లో గిరిజన రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే పత్తిని సేకరించిన గిరిజన రైతులు బస్తాల్లో వాటిని నింపి ఒడిశా, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు క్వింటా పత్తిని కొన్ని గ్రామాల్లో రూ.6650కు మరి కొన్ని గ్రామాల్లో రూ.6800ల చొప్పున ధర చెల్లించి కొనుగోలు చేస్తున్న దళారులు హుటాహుటిన వాటిని తరలిస్తున్నారు.



ఎస్.కే పాడులో దళారులు కొనుగోలు చేసిన పత్తి బస్తాలను లారీల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి: తోటపల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె తోటపల్లి దేవాలయం ప్రాంగణంలో తోటపల్లి టెంపుల్ డెవలెప్‌మెంట్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ బోర్డు నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ దేవాలయం పునర్నిర్మాణానికి జోలిపట్టి విరాళాలను సేకరిస్తారని చెప్పారు. ఏడాది కాలంలోనే ప్రధాన దేవాలయంతో పాటు మూడు ఉపదేవాలయాలను, షాపింగ్ కాంప్లెక్స్‌ను, ప్రాకార మంటపం, రాజగోపురం, అన్నప్రసాద సత్రం నిర్మించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం దేవాలయ ప్రతిష్ఠకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓ వీవీ సూర్యనారాయణ, ట్రస్ట్ సభ్యులు డి.పారినాయుడు, డి.ధనుంజయరావు, శ్రీరామచంద్రమూర్తి స్థానిక ఎంపీటీసీ ఎం.సింహాచలం నాయుడు, సర్పంచ్ ఎ.సింహాచలమమ్మ, నాయకులు ఎ. మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడుతోపాటు పలువురు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ధూపదీప నైవేద్యాల డబ్బులు ఇవ్వాలి

వీరఘట్టం: ఆలయాల నిర్వహణలో భాగంగా ప్రభుత్వం ఇవ్వాల్సిన ధూపదీప నైవేద్య పథకం డబ్బులు వెంటనే ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా అర్చకుల సంఘం అధ్యక్షుడు లింగరాజ్ రథో ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్ విషయమై స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన అర్చకులతో ఆదివారం సమావేశమైన ఆయన.. రిజిస్ట్రేషన్, పబ్లికేషన్ లేకపోవడంతో జిల్లాలోని 20 ఆలయాలకు ఎటువంటి పథకాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అర్చకుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మహేష్ పండా, బాలకృష్ణ మిశ్రో, యడ్ల రాంబాబు, సింహదాటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అర్చకులు

గ్రామాల్లో వీధులకు నేమ్ బోర్డులు



గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలోని పలు వీధులకు నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలోని అన్ని వీధులను గుర్తించేందుకు వీలుగా భజన భృందం సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో బోర్డులను ఏర్పాటు చేశారు. భజన బృందం సభ్యులు ఏర్పాటు చేసిన బోర్డులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయంటూ స్థానిక సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఎం.సింహాచలం నాయుడులు భజన బృందం సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు తయారు చేసిన బోర్డులను ఆయా వీధుల్లో ఎం.రామకృష్ణ, ఎం. సత్తిబాబు, ఎం.పకీరునాయుడు, జి.సూర్యనారాయణ, ఎం.గౌరీశంకరరావు తదితరులు ఏర్పాటు చేశారు.